సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 27 । ఆగస్టు । 2023



కళ తప్పుతున్న నీటి వంతెన

ఎస్సారెస్పీ నుంచి నీటిని సరఫరా చేసే పెద్ద వాగుపై నిర్మించిన నీటి వంతెనకు రక్షణ లేకుండా పోయింది.

- 10లో ▸



మన జిల్లాలో ఎప్పుడో..?

జిల్లాలో చేప పిల్లల పంపిణీకి ఇంకా ముహూర్తం కుదరలేదు. ఇదివరకే పలు జిల్లాల్లో చేప పిల్లల పంపిణీ మొదలైంది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.1 /23.4

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం మేఘావృతం కావొచ్చు. సాయంత్రం చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

కాంగ్రెస్‌లో చేరిక



ఖలీల్‌వాడి : చేవెళ్లలో శనివారం జరిగిన ప్రజాగర్జన సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లి కార్జున్ ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ , ప్రభుత్వ మాజీ విప్ అనిల్ ఆధ్వర్యంలో జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు గోర్త రాజేందర్, విత్తన కంపెనీ యజమాని మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మల్లికార్జున్ ఖర్గే పార్టీ కండువకప్పి ఆహ్వానించారు.

ఒకే రోజు 5 లక్షల మొక్కలు నాటేశారు

- స్వాతంత్య్ర భారత వజ్రోత్సవాల్లో భాగంగా..



డొంకేశ్వర్(ఆర్మూర్) : స్వాతంత్య్ర భారత వజ్రోత్సవాల్లో భాగంగా తెలంగాణకు కోటి మొక్కలహారం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖలు కలిపి జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో సామూహికంగా మొక్కలు నాటారు. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. శనివారం ఒకే రోజు 5లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకోగా, 581 లొకేషన్లలో 5,18,215 మొక్కలను నాటారు. ఇందులో అత్యధికంగా గ్రామీణాభివృద్ధి శాఖ 4,96,015 మొక్కలు నాటగా, అన్ని మున్సిపాలిటీలు కలిపి 21,000 మొక్కలు నాటారు. అదే విధంగా ఫారెస్టు శాఖ 1,200 మొక్కలు నాటింది.

భావితరాలకు అందించే సంపద పచ్చదనమే



వేల్పూర్: భవిష్యత్ తరాలకు మనం అందించే సంపద పచ్చదనమేనని రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన వేల్పూర్‌లో దివంగత వేముల సురేందర్‌రెడ్డి రైతు వేదిక వద్ద స్వాతంత్య్ర వజ్రోత్సవాల ముగింపు వేడుకలో భాగంగా అధికారులతో కలిసి మొక్కలు నాటారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆకుపచ్చ తెలంగాణాగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి, ఎంపీపీ బీమ జమున, డీఆర్‌డీవో పీడీ చందర్ నాయక్, వేల్పూర్ సర్పంచ్ తీగెల రాధ, బీఆర్‌ఎస్ నాయకులు రేగుల్ల రాములు, నాగధర్‌రెడ్డి, మండల గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ నమోదును సక్రమంగా నిర్వహించాలి



వర్ని(చందూర్, మోస్రా) : ఓటరు నమోదు ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. శనివారం చందూరు, మోస్రా మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటర్ నమోదు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా బీఎల్‌వో కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. 18 సంవత్సరాలు పైబడిన యువతీయువకులు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునే విధంగా వారిని చైతన్యపరచాలని, ఇంటింటికీ తిరిగి నమోదు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎంపీపీ లావణ్య రామ్ రెడ్డి, సర్పంచ్ సాయిరెడ్డి , సహకార సంఘం అధ్యక్షులు ప్యారం అశోక్, ఎంపీవో తారాచంద్ ఆర్‌ఐ భారతి ఉన్నారు.

యాష్కీ గారూ.. ఇదేం తీరు!



- ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే టిక్కెట్టు కోసం మాజీ ఎంపీ దరఖాస్తు
- నిజామాబాద్ నుంచి రెండుసార్లు ఎంపీగా ప్రాతినిధ్యం
- గత ఎన్నికల్లో ఓటమి తరువాత జిల్లా వైపు దృష్టి సారించని మధు
- ఏడాదిన్నర క్రితం నుంచే ఎల్‌బీనగర్‌పై కన్ను
- ముందే చెప్పిన 'సాక్షి' కథనం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నిజామాబాద్ ఎంపీగా రెండుసార్లు ప్రాతినిధ్యం వహించిన టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ తన తదుపరి రాజకీయ రంగస్థలంగా రంగారెడ్డి జిల్లా ఎల్‌బీనగర్ శాసనసభ స్థానాన్ని ఎంచుకున్నారు. ఎల్‌బీనగర్ టిక్కెట్టు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీ కార్యకర్తలు భిన్నరకాలుగా చర్చించుకుంటున్నారు. ఏడాదిన్నర కాలం నుంచే మధుయాష్కీ ఎల్‌బీనగర్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారంటూ పార్టీ శ్రేణుల్లో చెప్పుకుంటున్నారు. ఈ మేరకు ఆయన సన్నిహితులు సైతం ఈ విషయాన్ని పలుసార్లు ప్రస్తావించారు. ఈ కారణంగానే యాష్కీ టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌గా ఉన్నప్పటికీ నిజామాబాద్ జిల్లా వైపు చూడడం లేదంటూ జిల్లా నాయకులు, కార్యకర్తలు బహిరంగంగానే ఆరోపణలు గుప్పించారు. పార్టీ నాయకత్వం నాలుగు సార్లు ఎంపీ టిక్కెట్టు ఇవ్వగా రెండు సార్లు గెలిచిన యాష్కీ, జిల్లా విషయమై ఏమీ పట్టనట్లు వ్యవహరించడం పట్ల ఇక్కడి నాయకులు, కార్యకర్తలు వివిధ సమావేశాల్లోనే విమర్శలు చేయడం గమనార్హం. మధుయాష్కీ ఎల్‌బీనగర్ అసెంబ్లీ సీటు కోసం ప్రయత్నాలు చేస్తున్నారంటూ 'సాక్షి' పత్రికలో 2022 ఏప్రిల్ 3వ తేదీనే కథనం ప్రచురితమైంది.

> ■ పార్టీ నాయకత్వం నాలుగు సార్లు ఎంపీ టిక్కెట్టు ఇవ్వగా రెండుసార్లు గెలిచిన యాష్కీ, జిల్లా విషయమై ఏమీ పట్టనట్లు వ్యవహరించడం పట్ల ఇక్కడి నాయకులు, కార్యకర్తలు వివిధ సమావేశాల్లోనే విమర్శలు చేయడం గమనార్హం.



2022 ఏప్రిల్ 3న 'సాక్షి'లో ప్రచురితమైన కథనం

కష్టకాలంలో వదిలేసి వెళ్తే ఎలా..

బీసీలకు ప్రాధాన్యత కోరుతున్న నేపథ్యంలో పార్టీ అధిష్టానం సైతం తగిన సీట్లు ఇచ్చేందుకు సిద్ధమని ప్రకటించింది. ఇలాంటి సమయంలో రెండుసార్లు ఎంపీగా, జాతీయ నాయకుడిగా రాహుల్‌గాంధీ వద్ద గుర్తింపు తెచ్చుకున్న మధుయాష్కీ ఈ విధంగా తరలివెళ్లడ మేమిటని నాయకులు, కార్యకర్తలు అంటున్నారు. ఈ ఆలోచనతోనే ముందునుంచే నిజామాబాద్ జిల్లాకు పూర్తిగా దూరమయ్యారంటూ పలువురు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఎన్‌ఆర్‌ఐగా వచ్చిన యాష్కీని జిల్లా నుంచి వరుసగా రెండుసార్లు పార్లమెంటు సభ్యుడిగా గెలిపించినప్పటికీ జిల్లా ప్రజలు, పార్టీ కార్యకర్తలతో అంతగా మమేకం కాకపోవడంతో తరువాత వరుసగా రెండు సార్లు గెలిచే అవకాశాలను దూరం చేసుకున్నారంటున్నారు. అధిష్టానం ఉన్నతమైన అవకాశాలు కల్పిస్తే, కష్టకాలంలో జిల్లా పార్టీ కార్యకలాపాల విషయంలో ఏ మాత్రం పట్టింపు లేకుండా వ్యవహరించారని, తా జాగా ఆర్మూర్ నుంచి బీసీ నాయకుడిగా పోటీ చేసే అవకాశం ఉన్నప్పటికీ ఎల్‌బీనగర్ వెళ్లడమేమిటని కార్యకర్తలు గుర్రుగా ఉన్నారు.

జిల్లాలో సభ్యత్వ కార్యక్రమంతో పాటు మీనాక్షీ నటరాజన్ పాదయాత్రకు సైతం యాష్కీ దూరంగా ఉన్నారని పార్టీ నాయకులు అసహనంగా ఉన్నారు. కీలకమైన నిజాం షుగర్స్, పసుపు బోర్డు అంశాలపై చేసిన పోరాటాల్లో యాష్కీ తనకేమీ పట్టనట్లు ఉండడంతోనే గత ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌పై వ్యతిరేకతను కాంగ్రెస్‌కు అనుకూలంగా మలచుకోలేని దుస్థితి నెలకొందని కార్యకర్తలు చెబుతున్నారు. గతంలో మాజీ విప్ ఈరవత్రి అనిల్‌కుమార్ యాష్కీపై బహిరంగ సభలో తీవ్ర విమర్శలు చేయడంతో పాటు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయగా జిల్లా వ్యాప్తంగా కార్యకర్తలు ముక్తకంఠంతో మద్దతు తెలపడం గమనార్హం.

ఆర్మూర్‌లో పోటీ అవసరమైనప్పటికీ..

బీసీలకు ప్రాధాన్యత ఇస్తామని పార్టీ అధినాయకత్వం ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో, రాష్ట్రంలోని ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో రెండు నుంచి మూడు ఎమ్మెల్యే సెగ్మెంట్లు బీసీలకు ఇవ్వాలని పార్టీలో డిమాండ్ ఉంది. ఈ పరిస్థితుల్లో ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్ సెగ్మెంట్లు బీసీలకు కేటాయించే అవకాశాలున్నట్లు గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. కాగా ఇప్పటివరకు ఆర్మూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు సరైన నాయకత్వం లేకపోవడంతో పార్టీ కార్యక్రమాలు సక్రమంగా జరగకపోగా, అసలు ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరనే చర్చ జరుగుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో బీసీ వర్గానికి చెందిన, ఇప్పటివరకు నాలుగు సార్లు ఎంపీగా పోటీచేసి రెండుసార్లు గెలుపొందిన మధు యాష్కీ ఇటువైపు ఆలోచన చేయకపోవడమేమిటని పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పటిష్టంగా పోలీస్ వ్యవస్థ



కోటగిరిలో మాట్లాడుతున్న హోం మంత్రి మహ్మద్ మహమూద్ అలీ

హోం మంత్రి మహ్మద్ మహమూద్ అలీ

రుద్రూర్: తెలంగాణ రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ అత్యంత పటిష్టంగా ఉందని హోంశాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీ అన్నారు. నిజామాబాద్ జిల్లా కోటగిరిలో మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌ను శనివారం అసెంబ్లీ స్పీకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. గతంలో హైదరాబాద్‌లో ఘర్షణ వాతావరణం ఉండేదని, ప్రస్తుతం ప్రశాంతంగా ప్రజలు ఉంటున్నారని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో రాత్రి 9 గంటలకు బయటకు రావడానికి భయపడుతున్నారని.. తెలంగాణలో అర్ధరాత్రి సైతం ధైర్యంగా తిరిగే పరిస్థితులున్నాయన్నారు. దేశంలో ఉన్న సీసీ కెమెరాల్లో 64 శాతం సీసీ కెమెరాలు తెలంగాణలోనే ఉన్నాయన్నారు. సీఎం కేసీఆర్ పోలీస్ వ్యవస్థను పటిష్టం చేయడంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. తెలంగాణలో అన్ని వర్గాలకు సమ న్యాయం జరుగుతోందని అన్నారు. బాన్సువాడ నియోజక వర్గంలోని బడాపహాడ్ అభివృద్ధికి వక్ఫ్‌బోర్డు నుంచి రూ.2 కోట్లు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మైనారిటీ కార్పొరేషన్ సభ్యులు, మండల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సెప్టెంబర్‌లో కానిస్టేబుల్స్ ఫలితాలు?

- 5,313 మందికి సర్టిఫికెట్ వెరిఫికేషన్
- అభ్యర్థుల తుది జాబితాపై కసరత్తు
- జిల్లాలో 266 సివిల్, ఏఆర్ 134 పోస్టులు

ఖలీల్‌వాడి : కానిస్టేబుల్ తుది ఎంపిక జాబితాను పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డు సెప్టెంబర్ రెండో, లేదా మూడో వారంలో విడుదల చేయడానికి రంగం సిద్ధం చేస్తోంది. అక్టోబర్‌లో ఎన్నికల కోడ్ వస్తున్న నేపథ్యంలో ముందుగానే పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డు అభ్యర్థుల ఎంపికను పూర్తి చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. పోలీస్‌శాఖతో పాటు వివిధ విభాగలైన జైళ్లశాఖ, ఫైర్, ఆర్‌టీఏ(రవాణా), ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్‌లను భర్తీ చేయనున్నారు. జిల్లాలో 266 సివిల్ కానిస్టేబుల్స్, ఏఆర్ పోస్టులు 134 ఉన్నాయి. వివిధ విభాగాల సంఖ్య హైదరాబాద్ కమిషనర్ పరిధిలో ఉంది. జిల్లాకు కేటాయింపుల ప్రకారం జైళ్లశాఖ, ఫైర్, ఆర్‌టీఏ (రవాణా), ఎక్సైజ్‌శాఖలో కానిస్టేబుల్‌లను భర్తీ చేస్తారు. కానిస్టేబుల్ మెయిన్ పరీక్ష ఫలితాల ను మే 30న పోలీస్ నియామక మండలి ప్రకటించింది. జూన్ 1న ధ్రువపత్రాల పరిశీల న ప్రక్రియ పూర్తి చేశారు. ఇదిలా ఉండగా ఎస్సై పరీక్ష ఫలితాల్లో బాసర జోన్ పరిధిలోని 35 ఎస్సై పోస్టులకు ఎస్సైలను ఎంపిక చేశారు. ఎస్సై పోస్టులకు ఎంపికైన వారి వివరాలను స్పెషల్ బ్రాంచ్ పోలీసులు(ఎస్బీ) ఎంక్వైరీ చేశారు. ఎస్సైగా ఎంపికై న అభ్యర్థులకు మెడి కల్ టెస్టులు కొనసాగుతున్నాయి. ఎస్సైల ఎంపిక పూర్తి కావడంతో పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డు కానిస్టేబుళ్ల ఎంపికపై దృష్టి సారించింది. జిల్లాలో 5313 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు సర్టిఫి కెట్ల వెరిఫికేషన్ చేశారు. మిగితా విభాగాల పోస్టులు కాకుండా సివిల్, ఏఆర్ పోస్టులకు జిల్లాలోని ఒక్కో పోస్టుకు 13 మంది పోటీ పడుతున్నారు. వీరికి సంబంధించిన అన్ని రికార్డులు, ఆయా జోన్లు, పోలీస్, రెవెన్యూ జిల్లాలు, సామాజికవర్గాల వారీగా ఎంపిక ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలిసింది. ఈ ప్రక్రియ మొత్తం జరిగే వరకు రెండు నుంచి మూడు వారాలు పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది.



రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వం



మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

భీమ్‌గల్ : ఎమ్మెల్యే ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం భీమ్‌గల్ మండలంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటీ మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా బైక్ ర్యాలీలో ఎంపీ అర్వింద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లింగాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఎంపీ ఆవిష్కరించారు. ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ ప్రజలందరూ బీజేపీనే గెలిపించాలని నిర్ణయం తీసుకున్నారని, రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమని అన్నారు. బాల్కొండ నియోజక వర్గంలో బీఆర్‌ఎస్ నాయకుల ఆగడాలు ఎక్కువవుతున్నాయని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో తప్పకుండా బీఆర్‌ఎస్ నాయకులను ఓడించి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్ర నిప్పని నియోజకవర్గ ఎమ్మెల్యే జోల్లే శశికల, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు మహిపాల్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ కనికరం మధు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండేసి ఓట్లుంటే విచారణ

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

సుభాష్‌నగర్ : తుది ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఉండొద్దని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ సూచించారు. ముఖ్యంగా డబుల్ ఎంట్రీ, బోగస్ పేర్లు లేకుండా జాబితాను బీఎల్‌వో మొదలుకుని ఈఆర్‌వో స్థాయి వరకు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఎన్నికల సన్నద్ధతలో భాగంగా శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఓటరు జాబితా పక్కాగా, పూర్తి పారదర్శకంగా రూపొందేలా అన్ని స్థాయిలలో పర్యవేక్షణ జరపాలన్నారు. జాబితాలో రెండేసి పేర్లు కలిగిన వారిని గుర్తిస్తే, నోటీసులు జారీ చేయాలన్నారు. పక్షం రోజుల వరకు వివరణతో కూడిన సమాధానం రాకపోతే, క్షేత్ర స్థాయిలో సిబ్బందిని ఇంటికి పంపించి విచారణ చేయించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డూప్లికేట్, అనుమానాస్పద పేర్లు జాబితాలో ఉండకూడదని, ఇలాంటి వాటి వల్ల ఎన్నికల సందర్భంగా గందరగోళ పరిస్థితి నెలకొనే ప్రమాదం ఉంటుందన్నారు. అర్హులైన వారు ఉంటే ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. పేర్ల నమోదు, మార్పులు–చేర్పుల కోసం పోలింగ్ బూత్‌ల వారీగా నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాల గురించి విస్తృత ప్రచారం నిర్వహిస్తూ ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ముఖ్యంగా 18 నుంచి 19 ఏళ్ల కలిగిన యువత తప్పనిసరిగా ఓటరుగా పేరు నమోదు చేసుకునేలా చొరవ చూపాలన్నారు. ఈమేరకు కళాశాలలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. 18 ఏళ్ల పూర్తయిన ప్రతిఒక్కరూ సెప్టెంబర్ 19 లోపు ఓటరుగా పేరు నమోదు చేసుకునేలా అన్ని చర్యలు చేపట్టాలని సీఈవో సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారందరికీ వెంటనే ఓటరు గుర్తింపు కార్డు అందించేందుకు చొరవ చూపాలని, తమకు గుర్తింపు కార్డు అందలేదంటూ ఏ ఒక్కరి నుంచి ఫిర్యాదు రాకూడదని పేర్కొన్నారు. పోస్టల్ శాఖ ద్వారా పంపిస్తున్న ఓటరు ఐడీలు సకాలంలో, సంబంధిత ఓటర్లకు చేరుతున్నాయా అన్నది పర్యవేక్షించాలని ఆదేశించారు. తుది ఓటరు జాబితా రూపకల్పనకు ముందే క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, నూటికినూరు శాతం జాబితా పక్కాగా ఉండాలని వికాస్‌రాజ్ పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు పి యాదిరెడ్డి, చిత్రామిశ్రా, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం మకరంద్, డీసీవో సింహాచలం, ఈఆర్‌వోలు, సహాయ ఈఆర్‌వోలు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నువ్వుల ధర ఢమాల్

- వారం రోజుల్లో క్వింటాలుకు రూ.2,500 తగ్గిన రేటు
- కొరియాకు మనకంటే తక్కువ ధరకు నువ్వులు ఇస్తున్న పాకిస్తాన్
- మన నువ్వుల ఎగుమతిపై ప్రభావం
- జిల్లాలో రైతాంగం వద్ద నిలువ ఉన్న నువ్వులు దాదాపు 500 క్వింటాళ్లు

మోర్తాడ్(బాల్కొండ): ఆరోగ్య ప్రదాయనిగా పేరొందిన నువ్వులకు ధర దోబూచులాడుతుంది. వారం రోజుల కింద క్వింటాలు నువ్వులకు రూ.17,500 ఉన్న ధర ఇప్పుడు రూ.15 వేలకు దిగింది. కొరియాకు ఎగుమతి చేయడానికి మన దేశం వేసిన టెండర్ ధర కంటే మన దాయది దేశమైన పాకిస్తాన్ ఇంకా తక్కువ ధర నిర్ణయించింది. ఫలితంగా కొరియాకు ఆ దేశం సుమారు 800 లారీల నువ్వులను విక్రయించింది. ఈ ప్రభావంతో మన ప్రాంతంలోని నువ్వులకు ధర గణనీయంగా తగ్గిపోయింది. దీనికి తోడు ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్, మధ్యప్రదేశ్‌లలో వర్షాకాలంకు సంబంధించి సాగవుతున్న నువ్వుల పంట చేతికి వస్తే మన ప్రాంతంలోని నువ్వులకు ధర మరింత తగ్గే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.



నువ్వుల పంట

మన జిల్లాలో నువ్వుల పంట కేవలం యాసంగి సీజనులోనే సాగు చేస్తారు. అప్పట్లో సాగైన పంటను అకాల వర్షం దెబ్బతీసింది. అయినప్పటికీ కొంత మంది రైతులకు పంట దిగుబడి ఆశాజనకంగానే వచ్చింది. ధర పెరిగిన సమయంలోనే నువ్వులను విక్రయించాలనే ఉద్దేశంతో రైతులు నువ్వులను నిలువ ఉంచుకున్నారు. అలా నిలువ ఉంచుకున్న నువ్వులు దాదాపు 500 క్వింటాళ్లు ఉంటుందని వ్యాపారుల అంచనా. మొన్నటి వరకు క్వింటాలు నువ్వులకు మంచి ధర పలుకగా రైతులు సంతోషించారు. మరింత ధర పెరుగుతుందేమోననే ఉద్దేశంతో నువ్వులను విక్రయించలేదు. ఇప్పుడు విక్రయించాలంటే ధర తగ్గడంతో లాభం తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా బ్రెజిల్ దేశం నుంచి నువ్వులు మన దేశానికి దిగుమతి అవుతుండటం కూడా ధర తగ్గుదలకు కారణమైందని మోర్తాడ్‌కు చెందిన వ్యాపారి యాంసాని శేఖర్ 'సాక్షి'తో చెప్పారు. నువ్వులకు మొదటి నుంచి ధర ఆశాజనకంగానే ఉందని మార్కెట్‌లో మార్పులతోనే ధర పెరగడం, తగ్గడం జరుగుతుందని ఆయన వెల్లడించారు. ఏది ఏమైనా నువ్వులకు గతంలో కంటే ఎక్కువ ధర పలుకుతుండటంతో సాగు విస్తీర్ణం పెరగడానికి అవకాశం ఉందని చెప్పవచ్చు.

రాత్రంతా బావిలో మేకల కాపరి

బిచ్కుంద(జుక్కల్) : మేకపిల్లను రక్షించేందుకు వ్యవసాయ బావిలోకి దూకిన కాపరి రాత్రంతా బావిలోనే గడిపాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన దశరథ్ శుక్రవారం మేకల మందను కమ్మరి చెరువు ప్రాంతానికి తీసుకెళ్లాడు. మేత మేస్తుండగా ఒక మేక పిల్ల అక్కడే ఉన్న వ్యవసాయ బావిలో పడిపోయింది. తల్లి మేక అరుస్తుండడంతో వెళ్లి చూసిన దశరథ్‌కు బావిలో మేక పిల్ల కనిపించింది. వెంటనే దశరథ్ బావిలోకి దూకి మేకపిల్లను పైకి విసిరేశాడు. అప్పుడు సాయంత్రం 6 గంటలు అవుతుంది. అయితే రాళ్లతో కట్టిన బావి ఉండడంతో పైకి రావడానికి ఎంత ప్రయత్నించినా దశరథ్ రాలేకపోయాడు. బావి నుంచి అరిచినా ఎవ్వరూ రాకపోవడంతో చేసేదేమీలేక మోటర్ పైపును పట్టుకొని గోడకు ఉన్న చిన్న రాయి సహాయంతో రాత్రంతా బావిలోనే గడిపాడు. మరోవైపు ఇంటికి వచ్చిన మేకల వెంట దశరథ్ కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో వెతికినా జాడ దొరకలేదు. శనివారం ఉదయం 6 గంటల సమయంలో ఓ రైతు వెళ్తున్న శబ్దాన్ని విన్న దశరథ్ రక్షించాలని కేకలు వేశాడు. బావి వద్దకు వెళ్లిన రైతుకు దశరథ్ కనిపించడంతో వెంటనే కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తాడు సహాయంతో దశరథ్‌ను బావిలో నుంచి సురక్షితంగా బయటకు తీశారు. భయంతో రాత్రంతా నిద్రపోలేదని, కూర్చునే ఉన్నానని కాపరి తెలిపారు.





రాత్రంతా బావిలోనే ఉండిపోయిన దశరథ్‌ను బయటకు తీస్తున్న గ్రామస్తులు

క్లుప్తంగా

కొనసాగుతున్న పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): టీయూ పరిధిలో కొనసాగుతున్న పీజీ, బీఈడీ, ఎంఈడీ సెమిస్టర్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ తెలిపారు. పీజీ 4వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు ఉదయం 1,533 మంది, బీఈడీ 3వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు 120 మంది, ఎంఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షలకు 34 మంది, ఎంఈడీ 3వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు 33 మంది పరీక్ష రాసినట్లు పేర్కొన్నారు.

కాంపిటేటివ్ ఎగ్జామ్స్ సెల్ డైరెక్టర్‌గా రమణాచారి



తెయూ(డిచ్‌పల్లి): టీయూ కాంపిటేటివ్ ఎగ్జామ్స్ సెల్ డైరెక్టర్‌గా కేవీ రమణాచారి నియామకమయ్యారు. టీయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి నియామక ఉత్తర్వును రమణచారికి శనివారం అందజేశారు. తనపై నమ్మకంతో నియమించిన ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

డొంకేశ్వర్(ఆర్మూర్): రైతులు పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ శనివారం తెలిపారు. వాతావరణ పరిస్థితుల కారణంగా వరిలో కాండం తొలిచే పురుగు ఆశించే అవకాశం ఎక్కువ ఉందని రైతులు తగు చర్యలు చేపట్టాలన్నారు. పంటలో ఏవైనా ఇబ్బందులు వస్తే వెంటనే మండల వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు.

మొటాట్‌పల్లిలో శిలాఫలకం ధ్వంసం



భిక్కనూరు: మొటాట్‌పల్లి గ్రామంలో అభివృద్ధి పనులకు సంబంధించి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు శనివారం వేకువజామున ధ్వంసం చేశారు. ఇటీవల గ్రామంలో బీఆర్‌ఎస్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను సైతం చించివేశారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ మొటాటి రాజేశ్వరీరాజిరెడ్డి తెలిపారు.

బుస్సాపూర్‌లో మెడికల్ సీజ్



బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్‌లోని వాసవి మెడికల్, ఫస్ట్‌ఎయిడ్ క్లినిక్‌ను డ్రగ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ నర్సయ్య శనివారం తనిఖీలు నిర్వహించి సీజ్ చేశారు. మెడికల్‌లో గడువు ముగిసిన మందులు విక్రయిస్తున్నట్లు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. దుకాణంలో గడువు ముగిసిన మందులు లభించడంతో పాటు, ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌లో ప్రాథమిక చికిత్స చేయకుండా ఐవీకేన్‌లతో గ్లూకోజ్ ఎక్కిస్తున్నట్లు తేలడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట డ్రగ్స్ సూపర్‌వైజర్లు శ్రీలత, శ్రీకాంత్, ప్రోగ్రాం అధికారి రాజేశ్, సిబ్బంది ఉన్నారు.

మన జిల్లాలో ఎప్పుడో?

- పలు జిల్లాల్లో మొదలైన చేప పిల్లల పంపిణీ
- జిల్లాలో ఇంకా కుదరని ముహూర్తం
- టెండర్లు పూర్తి చేసుకుని ఎదురు చూస్తున్న మత్స్యశాఖ



చేప పిల్లలు

డొంకేశ్వర్(ఆర్మూర్): చేప పిల్లల పంపిణీ రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో మొదలైంది. మన జిల్లాలో మాత్రం ముహూర్తం ఇంకా కుదరలేదు. జిల్లాలోని ప్రముఖ ప్రజాప్రతినిధులు సమయం ఇవ్వకపోవడంతో తేదీ ఖరారు కాలేదు. దీంతో చేప పిల్లల పంపిణీ కొంత ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. మత్స్య శాఖ అధికారులు మాత్రం టెండర్లు పూర్తి చేసుకుని ఎదురు చూస్తున్నారు. జిల్లాలోని ఈ ఏడాది 1,018 చెరువుల్లో 4.71కోట్ల చేప పిల్లలను వదలాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకుగాను రూ.4.60కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా వేసింది. అయితే, చేప పిల్లల పంపిణీకి ఎప్పటిలాగే ఈ–ప్రొక్యూర్‌మెంట్ విధానంలో టెండర్లను ఆహ్వానించారు. టెండర్‌లో పాల్గొన్న నలుగురు వ్యక్తులకు టెండరు దక్కింది. క్షేత్రస్థాయి తనిఖీలకు వెళ్లిన అధికారులు గుత్తేదార్లకు ఉన్న చేప పిల్లలను పెంచుతున్న చెరువులను పరిశీలించి అంతా సవ్యంగా ఉందని రిపోర్టు ఇచ్చారు. కలిసికట్టుగా పని చేసుకునేలా గుత్తేదార్లు ఒకటై చేప పిల్లలను సరఫరా చేస్తున్నట్లు సమాచారం. అదే విధంగా జిల్లాలోని చెరువుల్లో వదలనున్న చేప పిల్లలు మొత్తం మూడు రకాలు, రెండు సైజుల్లో ఉండనున్నాయి. 35–40ఎంఎం సైజున్న 2.89కోట్ల పిల్లలను 866 చెరువుల్లో, అలాగే 80–100 సైజుగల 1.82కోట్ల పిల్లలను 152 చెరువుల్లో వదలాలని మత్స్యశాఖ కార్యచరణ రూపొందించింది. కాగా, ఇందులో బొచ్చ, రవాట, బంగారు తీగ రకాల చేప పిల్లలున్నాయి.అత్యధికంగా ఎస్సారెస్పీలో 60లక్షల మేర పిల్లలను వదలనున్నారు. పిల్లలను వదిలే ముందు మత్స్య సహకార సొసైటీలకు సమాచారం ఇచ్చి వారి సమక్షంలో చెరువుల్లోకి వదలనున్నారు.

జిల్లాలో చెరువులు	1,018
మత్స్య పారిశ్రామిక సంఘాలు	354
పంపిణీ చేయనున్న చేప పిల్లలు	4.71కోట్లు
అవసరమయ్యే నిధులు	రూ.4.60కోట్లు

త్వరలో తేదీ ఖరారు..

జిల్లాలో చేప పిల్లల పంపిణీకి తేదీ ఖరారు కావాల్సి ఉంది. మంత్రి సమయమిస్తే రెండు, మూడు రోజుల్లో ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తాం. ఈ ఏడాది నిర్దేశించుకున్న లక్ష్యానికనుగుణంగా చెరువుల్లో చేప పిల్లలను వదులుతాం. గుత్తేదార్లు నాణ్యమైన పిల్లలను పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటాం.

– రాజనర్సయ్య, జిల్లా మత్స్య శాఖ అధికారి

పోషణవనాలను ఏర్పాటు చేసుకోవాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారిణి

ఎడపల్లి(బోధన్): ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ వనాలను ఏర్పాటు చేసుకోవాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, వికలాంగుల శాఖ అధికారిణి రసూల్ బీ అన్నారు. మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం తనిఖీ చేశారు. రెండో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ వనాన్ని పరిశీలించి టీచర్ దేవ కుమారి, ఆయా రాణిలను అభినందించారు. పోషణ వనంలో పండించిన కూరగాయలను ఇక్కడే పిల్లలకు వండి పెట్టడం అభినందనీయమన్నారు. అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరడంతో అధికారులకు విన్నవిస్తానని పేర్కొన్నారు. బాలింతలు, గర్భిణులకు ఇబ్బందులు కలుగకుండా బెంచీలను ఏర్పాటు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. మరో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించగా న్యూట్రీగార్డెన్ సక్రమంగా లేకపోవడం, భవనం అపరిశుభ్రంగా ఉండడంతో టీచర్ మైనావతి, ఆయా పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఆమె వెంట బోధన్ సీడీపీవో జానకి, సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

ఉన్నత విద్యతోనే లక్ష్యసాధన



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి, ఓయూ వీసీ రవీందర్‌యాదవ్

- పేడెడ్ కలర్స్ పుస్తకాన్ని ఆవిష్కరించిన ఉన్నత విద్యామండలి చైర్మన్

తెయూ(డిచ్‌పల్లి): ఉన్నత విద్యతోనే అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తామని ఇందుకు నిదర్శనమే టీయూ తెలుగు అధ్యయన శాఖ అధ్యాపకుడు, ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ కనకయ్య అని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ రిక్క లింబాద్రి అన్నారు. ప్రొఫెసర్ కనకయ్య రాసిన 'నెరిసిన జీవితాలు'పుస్తకాన్ని రచయిత డాక్టర్‌వెంకటరెడ్డి ఇంగ్లిష్‌లోకి అనువదించిన 'పేడెడ్ కలర్స్' పుస్తకాన్ని హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ప్రొఫెసర్ లింబాద్రి, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ రవీందర్‌యాదవ్ శనివారం ఆవిష్కరించారు. కనీసం పెన్సిల్, స్కేల్ కొనుక్కోలేని పేదజీవితాలను కళ్లకు కట్టినట్టు ఆవిష్కరించి పుస్తక రూపంలో తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం ప్రొఫెసర్ కనకయ్యను సన్మానించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ననుమానస్వామి, పుష్పాలరవి, శ్రీనివాస్, చిలుక భాస్కర్, పసు నూరి రవీందర్, ఆచార్యులు నథానియేలు, జీవీ రత్నాకర్, పల్లెలు వీరస్వామి, సుధాకర్, సంజీవ్ పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు

టేకేదార్లకు జీవన భృతి

- జిల్లాలో 614 మందికి లబ్ధి

డొంకేశ్వర్(ఆర్మూర్): కార్ఖానాలు నిర్వహించే టేకేదార్లకు రాష్ట్ర ప్రభుత్వం జీవన భృతి అందజేస్తోంది. జిల్లాలో 614 మందికి పింఛన్లు ఇటీవల మంజూరయ్యాయి. వీరికి నెలకు రూ.2,016 ఇవ్వనుండగా, ఈ నెల నుంచే చేతికి రానున్నాయి. పోస్టాఫీసుల ద్వారా ఈ పింఛన్లను పంపిణీ చేయనున్నారు. లబ్ధిదారుల వివరాలను గ్రామీణాభివృద్ధి ఇప్పటికే అన్ని మండలాల ఎంపీడీవో కార్యాలయాలకు పంపింది.జిల్లాలో మొత్తం పింఛన్ల సంఖ్య 2,78,015కు చేరింది.

పెరిగిన పింఛన్ అందుకున్న దివ్యాంగులు..

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్లుగానే దివ్యాంగులకు పెరిగిన పింఛన్ డబ్బులు అందాయి. రూ.3,016 ఉన్న పింఛన్‌ను రూ.4,016కు ప్రభుత్వం పెంచింది. జిల్లాలోని 19,446 మంది దివ్యాంగులు పెరిగిన రూ.4,016 పింఛన్‌ను ఈ నెలలో అందుకుని సంతోషం వ్యక్తం చేశారు.

అరుణాచలానికి బస్సు సౌకర్యం

ఖలీల్‌వాడి: శ్రావణమాసం సందర్భంగా అరుణాచలానికి నిజామాబాద్ నుంచి ఈ నెల 29న బస్సు సౌకర్యం కల్పించినట్లు ఆర్‌ఎం జానీరెడ్డి శనివారం తెలిపారు. భక్తులు ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లను బుక్ చేసుకోవాలన్నారు. ఈ నెల 29న మధ్యాహ్నం 1 గంటకు బయలు దేరుతుందని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు డిపో మేనేజర్ 9959226017, 7382844366, 7382846084 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఎస్సారెస్పీలోకి పెరిగిన ఇన్‌ఫ్లో

బాల్కొండ: ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ఎస్సారెస్పీలోకి 5395 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోందని ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1090.60(88.11 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని వెల్లడించారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో మొదటి సంవత్సరంలో విద్యనభ్యసించడానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌సీవో కె. అలివేలు శనివారం తెలిపారు. ఎస్సీ బాలికలకు ఆర్మూర్ బాలికల కళాశాల ఎంపీసీలో 7 సీట్లు, నవీపేట్‌లో 12 సీట్లు, పోచంపాడ్‌లో 3 సీట్లు, బీసీ బాలికలకు ఆర్మూర్ బాలికల కళాశాలలో ఎంపీసీలో 3, బైపీసీలో 3, నవీపేట్‌లో ఎంపీసీలో 2, సుద్దపల్లిలో ఎంపీసీ, బైపీసీలో ఒక్కోటి ఖాళీ ఉన్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ బాలురకు ఆర్మూర్ బాలుర కళాశాలలో ఎంపీసీలో 15, బోధన్‌లో 5, వేల్పూర్‌లో 8, బైపీసీలో ఆర్మూర్‌లో 9, బోధన్‌లో 7, వేల్పూర్‌లో 16, ఎస్టీ బాలురకు ఎంపీసీలో బోధన్‌లో 1, బైపీసీలో 2, వేల్పూర్‌లో 3, బీసీ బాలురకు ఎంపీసీలో బోధన్‌లో 2, బైపీసీలో ఆర్మూర్‌లో 3, వేల్పూర్‌లో 3 సీట్లు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో కళాశాల ప్రిన్సిపాళ్లను సంప్రదించి సీటు పొందాలని సూచించారు.

ఇద్దరు ప్రభుత్వ టీచర్ల సస్పెన్షన్

నిజామాబాద్‌అర్బన్: మత ప్రచారం చేస్తున్నారని ఇద్దరు ప్రభుత్వ టీచర్లను డీఈవో దుర్గాప్రసాద్ శనివారం సస్పెన్షన్ చేశారు. ఆర్మూర్ మండలంలోని ఇస్సాపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన సునీత, సైదాబాద్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన రమేశ్ దంపతులు పాఠశాలల్లో మతప్రచారం చేస్తున్నారని స్థానికులు డీఈవోకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్మూర్ ఎంఈవో విచారణ చేపట్టి డీఈవోకు నివేదికను సమర్పించారు. డీఈవో వీరిని సస్పెన్షన్ చేశారు.

మైనారిటీల జీవితాల్లో వెలుగులు



మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మహమూద్ అలీ, స్పీకర్ పోచారం



హోంమంత్రిని గజమాలతోసన్మానిస్తున్న నాయకులు

- మైనారిటీల అభ్యున్నతికి కృషి
- హోంశాఖ మంత్రి మహమూద్ అలీ
- తెలంగాణలో 1,016 రెసిడెన్షియల్ స్కూళ్లు
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

రుద్రూర్/ వర్ని: మైనారిటీల జీవితాల్లో రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వెలుగులు నింపుతోందని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. కోటగిరి మండల కేంద్రంలో రూ.6కోట్ల 70లక్షలతో నిర్మించిన మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ భవనాన్ని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. మైనారిటీల పిల్లలు విద్యకు దూరమవుతున్నారని గుర్తించిన సీఎం కేసీఆర్ రెసిడెన్షియల్ స్కూళ్లు, కళాశాలలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పడక ముందు రెసిడెన్షియల్ స్కూళ్లు ఏడు ఉండగా కొత్తగా 204 పాఠశాలలను ప్రారంభించినట్లు తెలిపారు. ఇందులో లక్షా40వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో మైనారిటీల్లో చదువుకునే బాలికల శాతం పెరిగిందన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో ప్రతిభ చూపుతున్నారని అన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం ఆడపిల్లల వివాహానికి షాదీ ముబారక్, చిన్న వ్యాపారులకు రూ. లక్ష వంద శాతం సబ్సిడీపై అందిస్తోందని అన్నారు. ఇంతలా మైనారిటీలను ఆదరించే ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలో లేదని పేర్కొన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వందశాతం పథకాలు అమలవుతున్నాయని అన్నారు. వచ్చే ఎన్నికల్లో పోచారం శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ 1,016 రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేసినట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో సర్వమత పాలన కొనసాగుతోందని అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పంపిణీలో కూడా మైనారిటీలకు 25 శాతం ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. మండల కేంద్రంలో భారీ గజమాలతో హోంమంత్రి, స్పీకర్లను నాయకులు సన్మానించారు. అనంతరం మైనారిటీ యువకులకు రూ. లక్ష ఆర్థిక చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మైనారిటీ కమిషన్ చైర్మన్ తారీఖ్ అన్సారీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహ్మద్ ఇంతియాజ్, ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దీన్, వక్ఫ్ బోర్డు చైర్మన్ మసీఉల్లా ఖాన్, జడ్పీ చైర్మన్లు దాదన్నగారి విఠల్ రావు, దఫేదార్ శోభారాజు, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, బోధన్ ఆర్డీవో రాజా గౌడ్, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ సెక్రటరీ షఫీఉల్లా, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి

- పిల్లలకు మంచి, చెడు విచక్షణ నేర్పించాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీతాకుంచాల

ఖలీల్‌వాడి: మహిళలు, పిల్లల చట్టాలపై అవగాహన కల్పించడానికి విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్ పర్సన్ సునీత కుంచాల అన్నారు. శనివారం న్యాయసేవాసదన్‌లో 'మహిళలు, పిల్లల చట్టాలు' అనే అంశంపై శనివారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో జడ్జి న్యాయ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. మహిళలు, పిల్లలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలంటే చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. చట్టవ్యతిరేక చర్యలను చట్టం అనుమతించదని, మనుష్యుల మధ్య మానవ సంబంధాలు తగ్గుతున్నాయని, బలోపేతం చేసుకోవాలని కోరారు. మాదకద్రవ్యాలకు దూరంగా మసలుకొనే విధంగా పిల్లలను తీర్చుదిద్దుకోవాలన్నారు. మహిళలకు అనేక చట్టాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గృహహింస, భరణం, వరకట్న నిషేధం, మైనర్ బాలికల వివాహాల నిషేధం, పనిచేసే ప్రదేశాల్లో వివక్ష తదితర చట్టాలు మహిళల సాధికారతకు చాలా విలువైనవని అన్నారు. టీవీ సీరియల్స్‌లో మహిళలను విలన్లుగా చిత్రీకరించడం పెరిగిపోతుందన్నారు. అత్తను తల్లిగా కోడలు భావిస్తే సమస్యలు తగ్గుతాయని తెలిపారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కుష్బు ఉపాధ్యాయ్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను ఆడ, మగ అనే తేడా లేకుండా పెంచాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి మాట్లాడుతూ.. చట్టాల విజ్ఞానం అందరికి చేరవేయాలనే లక్ష్యాలకు అనుగుణంగా న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జ్యుడిషియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షురాలు సుజాత, ఉపాధ్యక్షురాలు పద్మ, సంయుక్త కార్యదర్శి వెంకట లక్ష్మి, పీరుబాయి, మీరా, లీలావతి, జ్యోతి, అమూల్య, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి నిందితుల రిమాండ్

కామారెడ్డి క్రైం: పలు దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. దేవునిపల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా గౌతమ్‌నగర్‌కు చెందిన అయూబ్‌ఖాన్, హైదరాబాద్ రాజేంద్రనగర్‌కు చెందిన మహమ్మద్ అమీర్ గత నెల 2న దేవునిపల్లి పరిధిలోని ఎస్సార్ వైన్స్ ముందు ఉన్న బైక్‌ను, వైన్స్ రేకులను ధ్వంసం చేసి రూ. మూడు వేల నగదును దొంగిలించారు. శనివారం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా నిజామాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న వీరు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. పట్టుకున్న పోలీసులు విచారణలో తామే బైక్, వైన్స్ దొంగతనానికి పాల్పడినట్లు వెల్లడించారు. గతంలో అయూబ్ పై 5, అమీర్‌పై 13 దొంగతనం కేసులు నమోదు కాగా జైలుకు వెళ్లి వచ్చినట్లు తెలిపారు. వీరు నిజామాబాద్‌లోని తాళం వేసి పలు ఇండ్లల్లో చోరీకి పాల్పడినట్లు చెప్పారు. నిందితుల నుంచి పల్సర్ బైకు, రూ. ఏడు లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

బీబీసీ పాఠశాలకు నోటీసులు జారీ

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని బీబీసీ ప్రైవేట్ పాఠశాలకు డీఈవో దుర్గాప్రసాద్ శనివారం నోటీసులు జారీ చేశారు. పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థినిని బయటకు తీసుకెళ్లిన ఘటనపై తల్లిదండ్రులు డీఈవోకు ఫిర్యాదు చేశారు. దీంతో దారుగల్లీ పాఠశాల హెచ్‌ఎం శంకర్‌ను డీఈవో విచారణ అధికారిగా నియమించారు. అంతకు ముందే 5వ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బీబీసీ పాఠశాల చైర్మన్ ప్రవీణ్‌పై కేసు నమోదైంది. విచారణ చేపట్టిన శంకర్ నివేదికను డీఈవోకు అందజేశారు. అనంతరం విచారణ మేరకు పాఠశాల గుర్తింపును రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బీజేపీ నాయకుల బాహాబాహీ

ఎల్లారెడ్డి: బీజేపీ నాయకులు బాహాబాహీకి దిగిన ఘటన ఎల్లారెడ్డి పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. పట్టణంలోని బాలాగౌడ్ ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ నాయకుల ప్రవాస్ యోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముందు వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో బీజేపీ రాష్ట్ర నాయకుడు పైల కృష్ణారెడ్డి ఫొటో లేక పోవడంతో బీజేపీ నాయకులు బైండ్ల పోచయ్యతో గొడవ పడినట్లు సమాచారం. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. చివరికి వేదికపై ఫ్లెక్సీ లేకుండానే సమావేశాన్ని నిర్వహించారు. ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడిన ఘటనలో కృష్ణారెడ్డి చేతి వేలికి గాయమైనట్లు సమాచారం.

రాజంపేటలో వృద్ధుడి ఆత్మహత్య

రాజంపేట: చెరువులో దూకి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఏఎస్సై గంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సత్తయ్య(75) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నాలుగు రోజుల క్రితం కామారెడ్డికి వెళ్తున్నట్లు చెప్పిన సత్తయ్య ఇంటికి తిరిగిరాలేదు. స్థానిక చెరువులో మృతదేహం లభ్యం కావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సత్తయ్య మృతదేహంగా గుర్తించారు. సత్తయ్య కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

నివాసపు గుడిసె దగ్ధం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): దావల్‌మల్కపల్లి గ్రామంలో పిట్ల సంగవ్వకు చెందిన నివాసపు గుడిసె విద్యుదాఘాతంతో దగ్ధమైనట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. గుడిసెలో అకస్మాతుగా మంటలు చెలరేగడంతో సంగవ్వ బయటకు వచ్చింది. గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఎడపల్లి(బోధన్): జానకంపేట సమీపంలోని లక్ష్మీ నృసింహస్వామి ఆలయ రహదారిపై రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కుర్నాపల్లి గ్రామానికి చెందిన జంగం రాజు తన బైకుపై వెళ్తుండగా ఆలయ రహదారి సమీపంలో ముందున్న బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ రాజు చికిత్స పొందుతూ మృతి చెందగా మరో బైక్‌పై ఉన్న మహిళకు తీవ్రంగా గాయాలయ్యాయి.

చికిత్స పొందుతూ ఒకరు..



మృతి చెందిన రాజన్న

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలంలోని అర్గుల్ గ్రామ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అల్లూరి రాజన్న (48) మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. అర్గుల్‌కు చెందిన రాజన్న వ్యవసాయ పనుల నిమిత్తం బైక్‌పై పొలానికి వెళ్లి వస్తుండగా జాతీయ రహదారిపై మరో బైక్ రాజన్నను ఢీకొన్నది. ఈ ఘటనలో రాజన్న తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఆర్మూర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాజన్న మృతి చెందాడు. మృతుడికి భార్య సత్తెమ్మ, కుమారుడు భాస్కర్ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



మృతి చెందిన మంజుల

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని గున్కుల్ గ్రామానికి చెందిన మొట్ట మంజుల(40) శనివారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. గ్రామస్తుల సమాచారం మేరకు ఏఎస్సై రాజేశ్వర్, బాన్సువాడ రూరల్ సీఐ మురళీ ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మంజుల హార్ట్‌స్ట్రోక్‌తో మృతి చెందిందని సీఐ తెలిపారు. ఇదిలా ఉండగా మంజుల ఇంటి తలుపులు తెరిచి ఉండడం, చుట్టు పక్కల బీపీ మాత్రలు ఉండడంతో గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు నమోదు చేస్తామని ఏఎస్సై తెలిపారు.

గుండెపోటుతో యువకుడు..



పృథ్వీరాజ్ (ఫైల్)

మాక్లూర్: గొట్టిముక్కల గ్రామానికి చెందిన పృథ్వీరాజ్ (24) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతికి తన మిత్రులతో కలిసి వెళ్లిన పృథ్వీరాజ్ 12వందల మెట్టు వద్ద స్పృహతప్పి పడిపోయాడు. ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందినట్లు పేర్కొన్నారు. పృథ్వీరాజ్‌కు మరో 15 రోజుల్లో వివాహం జరగాల్సి ఉండగా మృతి చెందడంతో ఇరు కుటుంబాల్లో విషాద చాయలు అలుముకున్నాయి.

గుర్తు తెలియని వృద్ధుడు..

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు శనివారం తెలిపారు. రైల్వేస్టేషన్‌తోపాటు పరిసరాల ప్రాంతంలో భిక్షాటన చేసేవాడని పేర్కొన్నారు. ఫొటో ఆధారంగా ఎవరైనా గుర్తిస్తే వివరాలు అందించాలని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కాలోజివాడిలో డీజే చోరీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): కాలోజీవాడి గ్రామంలో డీజే చోరీకి గురైనట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఈ నెల 24న గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన విందు కార్యక్రమానికి ముస్కు రవికుమార్‌కు సంబంధించిన డీజేను ఏర్పాటు చేశారు. 25న డీజే, సామగ్రి లేకపోవడంతో బాధితుడు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాళం వేసిన ఇండ్లల్లో ..

బాల్కొండ: మండలంలోని వన్నెల్(బి) గ్రామంలో తాళం వేసిన ఇండ్లు, కిరా దుకాణంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై గోపి శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన రాజవ్వ, వడ్డెర గంగన్న, దేవారెడ్డికి చెందిన ఇండ్లు, కిరాణ దుకాణంలో గుర్తు తెలియని దుండగులు తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. రెండు ఇండ్లల్లో ఆరు తులాల బంగారం, ఏడు తులాల వెండి, రూ. 29 వేల నగదు, కిరాణం షాపులో కొంత నగదు, సామగ్రి చోరీకి గురైనట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. చోరీల ఘటనతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.